## 230 పనిదినాలు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతాయని ప్రభుత్వం వెల్లడించింది. పాఠశాలల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచే తరగతులు ప్రారంభమవుతాయి. ఇప్పటికే జయశంకర్ బడిబాట ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈనెల 19 వరకు కొనసాగనుంది. వచ్చే విద్యాసంవత్సరంలో పాఠశాలలకు మొత్తం 230 పనిదినాలుంటాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 23 పాఠశాలలకు చివరి పనిదినం. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులుంటాయి. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా పాఠశాలల అకడమిక్ క్యాలెండర్‌ను సోమవారం విడుదల చేశారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవీ నరసింహారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే ఏడాది జనవరి పదో తేదీ వరకు పదో తరగతి విద్యార్థులకు సిలబస్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు.


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక


## ఆర్టీసీ బస్‌పాస్ రేట్లు పెంపు

హైదరాబాద్.అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) బస్‌పాస్ ఛార్జీలను పెంచింది. టోల్ ఛార్జీలు సవరించారు. సాధారణ ప్రజలతో పాటు, స్టూడెంట్ పాస్ ధరలను పెంచింది. తక్షణం పెరిగిన బస్‌పాస్ ఛార్జీలు అమల్లోకి వస్తాయని యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని రకాల బస్‌పాసులపై 20 శాతానికి పైగా రేట్లను పెంచారు. ప్రస్తుతం రూ.1,150 ఉన్న జనరల్ ఆర్డినరీ బస్‌పాస్ ధరను రూ.1,400కు (పెంపు 21.74 శాతం) పెంచారు. రూ.1,300 ఉన్న మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్ ధరను రూ.1,600కు (23.08 శాతం) పెంచారు. రూ.1,450 ఉన్న మెట్రో డీలక్స్ పాస్‌ను రూ.1,800కు పెంచారు. గ్రేటర్ హైదరాబాద్, గ్రీన్ మెట్రో ఏసీ పాస్ ధరలను కూడా భారీగా పెంచేశారు. ఎన్జీవోలు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు ఇచ్చే బస్‌పాస్ ధరలు కూడా పెరిగాయి. పుష్పక్ ఏసీ బస్‌పాస్ రేటు మాత్రం పెరగలేదు.


సంపుటి: 01 సంచిక : 238. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ మంగళవారం.10.06.2025 పేజీలు:4, వెల:రూ.1.00


# ఏం చేద్దాం..?
# కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై ఢిల్లీలో హైకమాండ్ సమాలోచనలు చేస్తోంది. ఈ సందర్భంగా మంత్రివర్గంలో పలువురి శాఖల మార్పు, ప్రస్తుతం సీఎం దగ్గర ఉన్న పలు కీలక శాఖలను ఇతరులకు ఇచ్చే అంశంపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఇందులో భాగంగా హుటాహుటిన హస్తిన పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో పార్టీ జనరల్ సెక్రెటరీ (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. దాదాపు గంటపాటు సాగిన ఈ భేటీలో మంత్రులకు శాఖల కేటాయింపుపై ప్రధానంగా చర్చ జరిగినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కొత్తగా మంత్రివర్గంలో స్థానం కల్పించిన గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకు ఏఏ శాఖలు కేటాయించాలి? అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. అదే విధంగా ప్రస్తుతం మంత్రుల దగ్గర ఉన్న శాఖలు, 18 నెలలుగా వారి సమర్థత, ఆయా శాఖలలో ప్రభుత్వ పనితీరు, విమర్శలు సీఎంతో పాటు, పలువురు మంత్రుల దగ్గర ఒకటికి మించి ఉన్న శాఖలను కేసీకి సీఎం రేవంత్‌రెడ్డి వివరించినట్టు తెలిసింది. ఈ లిస్టును కేసీ వేణుగోపాల్‌కు సీఎం రేవంత్ రెడ్డి సమర్పించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కాగా హోం, ఎడ్యుకేషన్, మున్సిపల్, మైనింగ్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్, కమర్షియల్ ట్యాక్స్, లా, లేబర్, స్పోర్ట్స్, యువజన శాఖలు సీఎం వద్దే ఉన్నాయి. వీటిలో కొత్త వారికి పలు శాఖలు అప్పగించడంతో పాటు పాత మంత్రుల శాఖలోనూ మార్పులు చేయాలని అధిష్టానం నిర్ణయించినట్టు తెలిసింది. ఇదే ఫైనల్‌గా మారితే డిప్యూటీ సీఎం మొదలు.. కీలక మంత్రుల శాఖలోనూ మార్పులు ఉండవచ్చని చెబుతున్నారు.నూతనంగా మంత్రి



బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్‌కు లేబర్, మైనింగ్, స్పోర్ట్స్ శాఖలు ఇవ్వనున్నట్టు పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. అలాగే వాకిటి శ్రీహరికి లా, యూత్, పశుసంవర్ధక శాఖలు లేదా మత్స్య శాఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అప్పగిస్తారని ప్రచారం సాగుతోంది. వీటితో పాటు మంత్రి పదవి ఆశించి భంగపడిన వారి వివరాలతో పాటు, వారిని శాంతింపజేసే అంశాలపై కూడా కేసీతో సీఎం మాట్లాడినట్టు తెలిసింది. అలాగే రాబోయే లోకల్ బాడీ ఎలక్షన్స్‌తో పాటు, కార్పొరేషన్లపై ఫోకస్ పెట్టాలని సీఎంకు సూచించినట్టు తెలిసింది. బీఆర్ఎస్‌లో అంతర్గత లొల్లి, బీజేపీ-బీఆర్ఎస్‌ల మధ్య రహస్య ఒప్పందాలను ఎండగడుతూ ప్రస్తుతం పార్టీని మరింత బలోపేతం చేయాలని కేసీ సూచించినట్టు సమాచారం.

# మహారాష్ట్ర, సీడబ్ల్యూసీ అభ్యంతరాలతోనే రీడిజైన్

. హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మహారాష్ట్ర, సీడబ్ల్యూసీ అభ్యంతరాలతోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు రీడిజైన్ చేయాల్సి వచ్చిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధార.. ఈ విషయం తెలంగాణ ప్రజలకు అర్థమైందని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఏదీ నోటి మాటగా చెప్పలేదు. అన్నీ సాక్ష్యాధారాలతో సహా సమర్పించామని స్పష్టం చేశారు. క్యాబినెట్ నిర్ణయాలు, వాప్కోస్ రిపోర్టులు, సీడబ్ల్యూసీ లేఖలు అన్నీ సమర్పించినట్టు వివరిం చారు. సోమవారం కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన అనంతరం బీఆర్కే భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ విచారణలో భాగంగా పిలవడం జరిగిందనీ, కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పానని తెలియజేశారు. ఆధారాలతో సమా ధానాలను కమిషన్‌కు అందజేశానని చెప్పారు. కమిషన్ విచారణకు హాజరై రాజకీయాలు మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయాలు ఏమైనా ఉంటే రేపు మాట్లాడుకుందామనీ, లోపల ఒకటి చెప్పి బయట మరొకటి చెప్పడం తప్పవుతుందని అభిప్రాయపడ్డారు.

తుమ్మిడిహెట్టిపైనే విచారణ

తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బ్యారేజీని ఎందుకు మార్చారనే అంశంపై చాలాసేపు చర్చ జరిగిందనీ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. దానికి నేనూ, కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి దగ్గరే ప్రాజెక్టు కట్టడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశామనీ, మహారాష్ట్ర కాంగ్రెస్ ఇరిగేషన్ మంత్రి హసన్ ముష్రఫ్‌ను కోరగా, చాలా రోజులుగా ముంపు గ్రామాల ప్రజలు మా ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు చేస్తున్నారనీ, ఎట్టి పరిస్థితుల్లో మేము ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పుకోబోమని హసన్ ముష్రఫ్ తేల్చి చెప్పారని అన్నారు. ఇదే విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చౌహాన్ అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డికి స్పష్టం చేశారనీ, ఈ విషయాన్ని కూడా కమిషన్ దష్టికి తీసుకు వెళ్ళానని ఆయన తెలిపారు.

తుమ్మిడిహెట్టి కోసం ఐదారు భేటీలు

మహారాష్ట్ర, తెలంగాణ మధ్య ఉన్న తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి ఐదారు భేటీలు జరిగాయని హరీశ్‌రావు తెలిపారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం పోయి బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీటిపారుదల శాఖ మంత్రిని కలిసి మళ్లీ తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలనీ, తెలంగాణకు నీటి అవసరం ఉందని కోరినట్టు చెప్పారు. స్వయంగా కేసీఆర్ మహారాష్ట్రకు వెళ్లి అప్పటి గవర్నర్ విద్యాసాగర్ సమక్షంలో బీజేపీ ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌ను కలిశారన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మాకంటే ముందు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ పార్టీ తరఫున అనేక పోరాటాలు చేసింది తానేననీ, ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు పర్మిషన్ ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వలేమని ఫడ్నవీస్ తేల్చి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణంలో ..

కేంద్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఏడు సంవత్సరాలు అధికారంలో ఉంటే ఒక్క అనుమతి కూడా సాధించలేదని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఒక్క అంత:రాష్ట్ర ఒప్పందం చేసుకోలేదనీ, ఒక గుంట భూమిని కూడా సేకరించలేదని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. తెలంగాణ ప్రాంతం నుంచి మంత్రులుగా ఉన్న కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి పట్టించుకోలేదనీ, సెంట్రల్ వాటర్ కమిషన్ తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని ప్రాజెక్టు నిర్మాణానికి ప్రత్యామ్నాయం చూసుకోవాలని లేఖ రాసిందని తెలిపారు. సీడబ్ల్యూసీ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులో ప్రతిపాదించిన రిజర్వాయర్ల సామర్థ్యం కూడా సరిపోదనీ, సామర్థ్యానికి సరిపోయే రిజర్వాయర్లను పెంచుకోవాలని పేర్కొందని చెప్పారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్‌ని బ్యారేజీ నిర్మాణ స్థల ఎంపిక చేయాలని కేసీఆర్ కోరినట్టు తెలిపారు. కేంద్ర సంస్థ వాప్కోస్ లాడార్ సర్వే చేసి, ఎగ్జామిన్ చేసి మేడిగడ్డ వద్ద నీటి లభ్యత ఉందనీ, అక్కడ ప్రాజెక్టు నిర్మాణం చేసుకోవచ్చని తెలిపిందని అన్నారు. వాప్కోస్,



సెంట్రల్ వాటర్ కమిషన్, ఇంజినీర్ల సూచన మేరకు మేడిగడ్డ వద్ద ప్రాజెక్ట్ నిర్మాణం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు.

నీళ్లు లేనిచోట కాంగ్రెస్ ప్రాజెక్ట్ ప్రతిపాదిస్తే..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడేండ్లుగా పొరుగు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించలేదనీ, అదేవిధంగా మహారాష్ట్రలో ముంపునకు గురవుతున్న చోట చాప్రాల్ వైల్డ్ లైఫ్ ఉందని, ఈ వైల్డ్ లైఫ్ అనుమతులు లభించాలంటే కనీసం 10 సంవత్సరాలు సుప్రీంకోర్టులో కొట్లాడాల్సి వస్తుందని హరీశ్‌రావు అన్నారు. నీళ్లు లేనిచోట కాంగ్రెస్ ప్రాజెక్ట్ ప్రతిపాదిస్తే నీళ్లు ఉన్నచోట ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిందని తెలిపారు. అన్ని రకాల ఆధారాలు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాసుకున్న ఉత్తరాలు, జీవోలు అన్నీ కమిషన్‌కు సమర్పించినట్టు హరీశ్‌రావు పేర్కొన్నారు.

కాళేశ్వరం కార్పొరేషన్‌కి అనుమతి ఉందా..?

కాళేశ్వరం కార్పొరేషన్‌కి అనుమతి ఉందా అని అడిగారనీ, కాళేశ్వరం కమిషన్‌కు స్పష్టంగా అనుమతి ఉన్న విషయాన్ని అన్ని ఆధారాలతో సమర్పించినట్టు హరీశ్‌రావు తెలిపారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీ లోకేషన్ మార్పుల గురించి అడగ్గా, అది పూర్తిగా టెక్నికల్ నిర్ణయం. ఇంజినీర్ల డీటెయిల్ సర్వే ఆధారంగా బ్యారేజ్ లోకేషన్ మారిందనీ, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు తీసుకునే నిర్ణయమని చెప్పానని అన్నారు. వాటికి సంబంధించిన ఆధారాలు కూడా కమిషన్‌కి సమర్పించామన్నారు.

కూళేశ్వరం అని అంటున్నారు..

ఇక ఈ ప్రాజెక్టులో రిజర్వాయర్లకు కెపాసిటీ ఎంత అని కమిషన్ చైర్మెన్ అడిగిన ప్రశ్నకు 141 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించామని చెప్పానని వివరించారు. కాళేశ్వరంపై పిచ్చికూతలు కూస్తూ కూళేశ్వరం అని మాట్లాడుతున్నారనీ, కాళేశ్వరంలో 100 భాగాలు, అన్ని ఇంటెక్ట్ ఉన్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్స్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్, 240 టీఎంసీల నీటి వినియోగం.. పూర్తిగా ఇవన్నీ ఇంటాక్ట్ ఉన్నాయని హరీశ్‌రావు తెలిపారు.

మల్లన్న సాగర్ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం..

ముఖ్యమంత్రి గంధమల్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారనీ, ఈ ప్రాజెక్టుకు నీళు మల్లన్న సాగర్ నుంచి పోతాయని, మల్లన్న సాగర్ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమని, హైదరాబాద్ మూసీ సుందరీకరణకు మల్లన్న సాగర్ నుంచి నీళ్లు తరలిస్తామంటున్నారని హరీశ్‌రావు అన్నారు. ఆ మల్లన్న సాగర్ కాళేశ్వరంలో అంతర్భాగమని, అదేవిధంగా హైదరాబాద్‌కు తాగునీటిని మల్లన్న సాగర్ నుంచి ఇస్తామంటున్నారని, అది కాళేశ్వరంలో భాగం కాదా అని తెలిపారు. మల్లన్నసాగర్‌పై ఆధారపడ్డ గంధమల్లకు టెండర్లు పిలిచి శంకుస్థాపన చేస్తారని, మరో పక్క కాళేశ్వరం కూలింది అని దుష్ప్రచారం చేస్తారని హరీశ్‌రావు మండిపడ్డారు.

# మోడీ పాలనకు 11 ఏండ్లు




న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: గత సంవత్సర కాలంగా మోడీ తీసుకున్న నిర్ణయాలు జనగణనతో పాటే కులగణన చేస్తామని ప్రకటించడం, ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రపంచ దేశాలకు ప్రతినిధి బృందాలను పంపడానికి ప్రతిపక్షాల సాయం కోరడం, కేంద్ర ప్రభుత్వంలో ఖాళీల భర్తీకి సంబంధించి లాటరల్ ఎంట్రీ నియామకాలలో రిజర్వేషన్లు కోరడం, వాజ్‌పేయి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 21 సంవత్సరాల నాటి పెన్షన్ సంస్కరణల నిర్ణయాన్ని రద్దు చేయడం ద్వారా ఏకీకృత పెన్షన్ పథకాన్ని తీసుకురావడం, వక్ఫ్ సవరణ వంటి కీలక బిల్లులను పార్లమెంటరీ కమిటీల పరిశీలనకు పంపడం వీటిని చూస్తుంటే మిత్రపక్షాలు, ప్రతిపక్షాల ఒత్తిడి కింద మోడీ ఎలా పనిచేయాల్సి వచ్చిందో అర్థమవుతుంది. మోడీ తన మూడో పదవీకాలంలో ఇప్పటికి సంవత్సర కాలాన్ని పూర్తి చేసుకున్నారు. ప్రభుత్వ 11 సంవత్సరాల పాలనపై దృష్టి సారించాలని బీజేపీ భావిస్తున్న నేపథ్యంలో గత సంవత్సర కాలంలో తీసుకున్న ఐదు కీలక నిర్ణయాలను సింహావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జనగణనతోనే కులగణన

జనగణనతో పాటు కులగణన కూడా చేపడతామని ఏప్రిల్ 30న ప్రధాని ప్రకటించారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ప్రతిపక్ష పార్టీలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల సమయంలోనే ఇది ప్రచారాంశంగా మారింది. కులగణన జరపాలని నిర్ణయించడం ద్వారా సమాజం, దేశం యొక్క విలువలు, ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్న విషయం స్పష్టమైందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రతిపక్ష ఇండియా బ్లాక్.. కులగణన రాజకీయ అంశంగా మార్చిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కులగణనను వ్యతిరేకించాయని గుర్తు చేశారు. అయితే లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో కులగణనను బీజేపీ తప్పుపట్టింది. దీనిని సమాజాన్ని విభజించే చర్యగా అభివర్ణించింది. కానీ ఇప్పుడు మాట మార్చి వచ్చే ఏడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి జనగణనతో పాటే కులగణనను రెండు దశలలో నిర్వహిస్తామని ప్రకటించింది.

లేటరల్ ఎంట్రీ నియామకాలపై

ఎన్డీఏలోని కొన్ని భాగస్వామ్య పక్షాల డిమాండ్ మేరకు మోడీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వంలోని 45 కీలక పోస్టుల భర్తీ కోసం లేటరల్ నియామకాలకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని యూపీఎస్సీని కోరింది. ఈ చర్య సామాజిక న్యాయం, సాధికారత సాధనలో గణనీయమైన పురోగతి అవుతుందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ చెప్పుకొచ్చారు. లేటరల్ ఎంట్రీ ప్రక్రియ రిజర్వేషన్లకు అనుగుణంగా ఉండాలని మోడీ భావిస్తున్నారని కూడా తెలిపారు. అంతకుముందు యూపీఎస్ఈ జారీ చేసిన లేటరల్ ఎంట్రీ నియామకాల ప్రకటనను ప్రతిపక్షాలు తప్పుపట్టడమే కాకుండా రిజర్వేషన్ల అమలును అడ్డుకునేందుకు జరిపిన కుట్రగా అభివర్ణించాయి. యూపీఎస్సీ ప్రకటనను ప్రతిపక్షాలతో పాటు ఎన్డీఏ భాగస్వామి అయిన కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ పోస్టుల రిజర్వేషన్లలో 'కానీ, అయితే' వంటి పదాలు ఉండవని చెప్పారు.

మధ్యేమార్గంగా యూపీఎస్ అమలు

కేంద్ర ప్రభుత్వం గత ఆగస్టులో ఏకీకృత పెన్షన్ పథకాన్ని (యూపీఎస్) ఆమోదించింది. వాజ్‌పేయి ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ పెన్షన్ పథకాన్ని (ఎన్‌పీఎస్) అటకెక్కించి యూపీఎస్‌కు పచ్చజెండా ఊపింది. మళ్లీ పాత పెన్షన్ పథకాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసిన నేపథ్యంలో ప్రభుత్వం మధ్యేమార్గంగా ఈ నిర్ణయం తీసుకుంది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార?ండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ సహా అనేక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు తిరిగి ఓపీఎస్‌ను అమలు చేశాయి. ఎన్‌పీఎస్‌పై సమీక్ష జరిపేందుకు 2023 ఏప్రిల్‌లో మోడీ ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ యూపీఎస్‌ను సిఫారసు చేసిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. హర్యానా, మహారాష్ట్ర, జార?ండ్ శాసనసభ ఎన్నికలకు ముందు యూపీఎస్‌పై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

ప్రతిపక్షాల సహకారం కోసం

ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రభుత్వం తన చర్యలకు ప్రపంచ దేశాల మద్దతు పొందేందుకు దౌత్య యత్నాలు ప్రారంభించింది. ఇందుకోసం ప్రతిపక్షాల సహకారాన్ని కోరింది. మోడీ 1.0, మోడీ 2.0 పాలనలో అవలంబించిన వైఖరులకు ఇది పూర్తి భిన్నంగా ఉంది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, పాక్‌తో సైనిక వివాదం నేపథ్యంలో విదేశీ వ్యవహారాల విషయంలో ప్రభుత్వం ప్రతిపక్షాల మద్దతు కోరింది. గడచిన పది సంవత్సరాల పాలనలో మోడీ భారత విదేశాంగ విధానాన్ని స్వయంగానే రూపొందించుకున్నారు. 2019లో పుల్వామాలో జరిగిన దాడి, బాలాకోట్ వైమానిక దాడుల సమయంలో మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాలను సంప్రదించిన దాఖలాలు లేవు. కానీ ఈసారి ప్రతిపక్ష ఎంపీలతో కూడిన ప్రతినిధి బృందాలను వివిధ దేశాలకు పంపింది. అఖిలపక్ష ప్రతినిధులు, దౌత్యవేత్తలతో కూడిన ఏడు బృందాలు 33 దేశాలలో పర్యటించాయి. ఈ బృందాలలో మూడింటికి ప్రతిపక్ష ఎంపీలు నేతృత్వం వహించగా రెండింటికి బీజేపీ ఎంపీలు, మిగిలిన రెండింటికి సంకీర్ణ భాగస్వాములు నాయకత్వం వహించారు. గతంలో ప్రభుత్వాలు ఇలాగే ప్రతినిధి బృందాలను విదేశాలకు పంపాయి. మోడీ హయాంలో తొలిసారిగా ఆ విధంగా పంపడం జరిగింది.

అనేక బిల్లులపై పునరాలోచన

మోడీ ప్రభుత్వం తొలి రెండు పదవీకాలాలలో చాలా దూకుడుగా వ్యవహరించింది. 2020లో వివాదాస్పద వ్యవసాయ బిల్లులు తీసుకొచ్చింది. ఆర్టికల్ 370ని రద్దు చేసింది. ప్రతిపక్ష ఎంపీలను రికార్డు సంఖ్యలో పార్లమెంట్ నుండి బహిష్కరించింది. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత సీన్ రివర్స్ అయింది. ప్రతిపక్షాలు పుంజుకోవడంతో ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల తర్వాత మోడీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన తొలి బిల్లు వక్ఫ్ సవరణకు సంబంధించింది. దీనిని గత ఆగస్టులో ప్రవేశపెట్టారు.

దీనిపై ప్రతిపక్షాలు మూకుమ్మడిగా విమర్శలు సంధించాయి. ముస్లింలను లక్ష్యంగా చేసుకున్న ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకమని మండిపడ్డాయి. ప్రతిపక్షాల నిరసనల మధ్య ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపింది. ఎట్టకేలకు ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. కానీ ప్రతిపక్షాల నుండి గట్టి ప్రతిఘటన ఎదురైంది. రాజ్యసభలో బిల్లుకు అనుకూలంగా 128 ఓట్లు రాగా వ్యతిరేకంగా 95 ఓట్లు పడ్డాయి. లోక్‌సభలో బిల్లును 288 మంది సమర్థించగా 232 మంది వ్యతిరేకించారు. ప్రతిపక్షాల అభ్యంతరాల నేపథ్యంలో మోడీ ప్రభుత్వం ప్రసార బిల్లును కూడా పక్కన పెట్టింది. ఇక రియల్ ఎస్టేట్ అమ్మకాలలో పన్ను లెక్కింపు విధానంలో మార్పులకు సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయాలపై విమర్శలు రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. పన్ను చెల్లింపుదారులు కొత్త, పాత పన్ను రేట్లలో దేనిలో ఒక దానిని ఎంచుకునేందుకు అనుమతించే బిల్లును లోక్‌సభ ఆమోదించింది.

# ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడలేదు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఫోన్ ట్యాపింగ్‌కు తాను పాల్పడలేదనీ, ట్యాపింగ్ చేయాలని కింది స్థాయి అధికారులకు ఆదేశాలివ్వలేదని ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు స్పెషల్ టీం అధికారుల ఎదుట వాదించారు. సిట్ అధికారులు వేసిన పలు ప్రశ్నలకు ఆయన ఎదురు ప్రశ్నలు వేసి దర్యాప్తు అధికారులను విస్మయ పర్చారు. సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ప్రభాకర్ రావు సోమవారం సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. 14 నెలల తర్వాత ఆయన అమెరికా నుంచి ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన విషయం తెలిసిందే. సుప్రీం ఆదేశాల మేరకు విచారణకు హాజరై ఆయనను స్పెషల్ టీం అధికారులు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8.30 వరకు సుదీర్ఘంగా ప్రశ్నించారు. పశ్చిమ మండల డీసీపీ విజయకుమార్ స్వీయ పర్యవేక్షణలో సిట్ ఏసీపీ వెంకటగిరితో పాటు మరో నలుగురు అధికారులు ఆయనను విచారించారు. విచారణ ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు రెండు గంటల పాటు ఫోన్ ట్యాపింగ్‌లో ప్రభాకర్‌రావుపై వచ్చిన ఆరోపణలపై మొదట అధికారులు వివరణలు తెలుసుకున్నట్టు తెలిసింది. ఆ సందర్భంలో తాను కోర్టుకు ఇచ్చిన సమాచారాన్నే మళ్లీమళ్లీ చెప్పినట్టు సమాచారం. ఎన్నికల




ఫలితాలు వచ్చిన మరుసటి రోజే తమ కార్యాలయంలోని ఫోన్ ట్యాపింగ్ పరికరాలు, హార్డ్ డిస్క్‌లు, కంప్యూటర్లను ఎందుకు ధ్వంసం చేయించారని అధికారులు ప్రశ్నించగా ఆ విషయం తనకు తెలియదని సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. డీఎస్పీ ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు తిరుపతన్న భుజంగరావు, మరో అదనపు డీసీపీ రాధాకిషన్‌రావులకు ఫోన్ ట్యాపింగ్ చేయమంటూ మీరు కొన్ని నెంబర్లను ఇచ్చిన మాట నిజం కాదా అని ప్రశ్నించగా, తాను ఎస్ఐబీకి సంబంధించి మాత్రమే ఆదేశాలిచ్చే వాడినని సమాధానం దాట వేశారని తెలిసింది. మునుగోడు ఉప ఎన్నిక మొదలుకుని సాధారణ ఎన్నికల వరకు ప్రతిపక్ష నాయకులు, వ్యాపారులు, మరి కొంతమంది వ్యక్తుల ఫోన్ల ట్యాపింగ్‌కు ఆదేశాలివ్వడం నిజం కాదా అనే ప్రశ్నకు తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయనన్నట్టు సమాచారం.

# గురుకులాల పనివేళల మార్పునకు ప్రభుత్వం అంగీకారం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలల పనివేళల మార్పునకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడతాయని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు అజిత్‌రెడ్డి, వేముల శ్రీనివాస్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సీఎం ఆదేశాల మేరకు త్వరలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా తగు ఉత్తర్వులను విడుదల చేయనున్నట్టు హామీ ఇచ్చారని తెలిపారు. గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలనీ, హెల్త్ కార్డులు ఇవ్వాలనీ, గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. గురుకుల పాఠశాలల ఉమ్మడి డైరెక్టరేట్, తాత్కాలిక ఉద్యోగులకు 12 నెలల వేతనాలు ఇవ్వాలని తెలిపారు. ఆ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామంటూ వారు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్, గురుకుల ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు కల్పించడానికి



ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందదంటూ సీఎంవో, విద్యాశాఖ అధికారులు చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్టీటీఏ బాధ్యులు వేంరెడ్డి దిలీప్‌రెడ్డి, ఉప్ప అశోక్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి..





అచ్చంపేట :అమృత్ తెలంగాణ: వ్యవసాయ పొలంలో నీటి నిల్వకు తీసుకున్న కవర్ గుంతలో పడి ఇద్దరు చిన్నారులు, అన్నదమ్ములు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బొమ్మనపల్లి గ్రామంలో వ్యవసాయ పొలంలో నీటి నిల్వ కోసం తీసుకున్న కవర్ గుంటలో పడి ప్రమాదవశత్తు ఇద్దరు పిల్లలు (అన్నదమ్ములు) మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుంభం ధరణి, సుధాకర్ దంపతులకు అశ్విత్ కుమార్ (8), చేతన్ (6) తల్లిదండ్రులతో కలిసి పొలానికి వెళ్లారు. తల్లిదండ్రులు పత్తి విత్తనాలు విత్తే పనిలో నిమగ్నమయ్యారు. ఇద్దరు అన్నదమ్ములు సమీపంలోని పొలం దగ్గర ఆడుకుంటూ ప్రమాదవశత్తూ నీటి గుంతలో పడి మృత్యువాత పడ్డారు. కొంత సమయానికి పిల్లలు కనిపించడం లేదని, చుట్టూ పక్కన వెతకగా గుంతలో పడివున్నారు. ఇద్దరు అన్నదమ్ములు ఒకే కుటుంబంలో ఒకేసారి అనుకోని దుర్ఘటనలో మృత్యువాత పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



భువనగిరి :అమృత్ తెలంగాణ: భువనగిరి మండలంలోని అనంతారం గ్రామానికి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా కాంగ్రెస్ నాయకులు పక్కీరు కొండల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎర్ర కళ్ళమ్మ శ్రీరాములు, మాజీ ఉప సర్పంచ్ విఠల్ వెంకటేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జహంగీర్, నరసింహ, పద్మ, పాండు, ఎర్ర మహేష్,చిన్న అంజయ్య, ప్రదీప్ ,పంచాయతీ సెక్రటరీ నర్సింగరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి..



భువనగిరి:అమృత్ తెలంగాణ: జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల సమస్యల నుండి వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 41 అర్జీలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలసి స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 28,జిల్లా పరిషత్ 4, మున్సిపాలిటీ 3,జిల్లా పంచాయతీ శాఖ 2, హౌసింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పశు వైద్య శాఖ, ఎస్సీ కార్పొరేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభా రాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆన్ లైన్ బెట్టింగ్ కు యువకుడు బలి



తంగళ్ళపల్లి :అమృత్ తెలంగాణ: ఆన్ లైన్ బెట్టింగుకు ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తంగళ్ళపల్లి మండలంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన విరాల ప్రకారం మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన తుమ్మల వంశీ (20) అనే యువకుడు ఇంటర్మీడియట్ పూర్తి చేసి కరీంనగర్ పట్టణంలో కార్ మెకానిక్ పనిచేస్తున్నాడు. గత మూడు సంవత్సరాలుగా ఆన్ లైన్ బెట్టింగులకు అలవాటు పడి ఆన్లైన్ గేమ్లు ఆడుతుండేవాడు. ఆ ఆన్లైన్ గేమ్ల ద్వారా సుమారుగా రూ.10 లక్షలు పోగొట్టుకున్నాడని మృతుడి తండ్రి శ్రీనివాస్ తెలిపాడు. అంతేకాకుండా చేసిన అప్పులను తీర్చేందుకు స్నేహితుల వద్ద, తెలిసిన వారి వద్ద నుండి అప్పులు చేసి మరింత మొత్తంలో ఆన్లైన్ గేమ్లు ఆడుతుండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పులు బాగా చేయడంతో విషయం కాస్త ఇంట్లో తెలవగా తల్లిదండ్రులు అతన్ని మందలిచ్చినట్లు తెలిపారు. సోమవారం ఉదయం పొలంలో ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# వంట కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి..




భువనగిరి :అమృత్ తెలంగాణ: మధ్యాహ్న భోజన పాఠశాల వంట కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. సోమవారం రోజున వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసన తెలిపి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కర్ రావు కి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభానికి రెండు రోజులే ఉందని, వంట కార్మికులకు గత సంవత్సరం వంట బిల్లులు, వేతనాలు, కోడి గుడ్ల బిల్లులు పెండింగ్ లోనే ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు వంటలు ఎలా చేయాలో అధికారులు ఆలోచన చేయాలని కోరారు. 2023 అక్టోబరు నెల నుండి అల్పాహారం బిల్లులు కూడా పెండింగ్ లోనే ఉన్నాయి అన్నారు. రాగి జావ తయారు చేయడానికి గ్యాస్ సిలిండర్ల ఖర్చు చాలా అవుతుందని, ఎలాంటి పారితోషికం లేకుండా తయారు చేయడం ఇబ్బంది కనుక రాగి జావకు ప్రతీ విద్యార్థికి రూ.2/- చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ 10 వేల వేతనం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు వేతనాలు కోడి గుడ్ల బిల్లులు అన్నీ పాఠశాలలు ప్రారంభానికి ముందే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బాగుల వసంత, జిల్లా ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, నాయకులు అనసూర్య, పారిజాత, స్వేత, పూర్ణమా, రమ, లక్ష్మమ్మ, రమ, వరలక్ష్మి, రత్న, జాన్సీ, రూప, మున్ని, లక్ష్మి, రేణుక, వెంకటమ్మ, పారిజాత, పుష్ప, గంగమ్మ, పాల్గొన్నారు.

# పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం..



పెద్దవూర :అమృత్ తెలంగాణ: పేద ప్రజలకు ఉచిత వైద్యం అందజేయడం ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని నాగార్జున సాగర్ ఎం ఎల్ ఏ కుందూరు జయవీర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం లో 1.56 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన ప్రభుత్వ ఆస్పత్రిని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి తో కలిసిప్రారంభించారు. మాట్లాడారు. ఎంతో కాలంగా ఎదురు సూస్తున్న ప్రజల చిరకాల స్వప్నం నెరవేరనుందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు. ఆనాడు రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజలకు ఉచిత వైద్యం అందజేయాలని ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలుచేస్తే, ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచారన్నారు. వైద్యపరంగా పేదలకు మెరుగైన వసతులు కల్పించడం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం వైద్య సేవలను అందుబాటు లోకి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు, విద్య, వైద్య,వ్యవసాయరంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీ పథకంలో ఐదులక్షల నుంచి పది లక్షల వరకు పెంచి ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అలాగే అనంతరం ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు 1.56 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రభుత్వ పథకాలను కొనసాగించాల్సిందేనని అన్నారు. మండల అధ్యక్షులు పబ్బు యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ ఓ కేస రవి,మండల వైద్యాధికారి నగేష్,పీఓడీడీ కృష్ణ కుమారి,తాహశీల్దార్ శ్రీనివాస రావు,ఎంపీడీవో సుధీర్ కుమార్,మండల సీహెచ్ఓ శ్రీనివాస్,జెడ్పి మాజీ వెస్ ఛైర్మెన్ కర్నాటి లింగారెడ్డి,మాజీ ఎంపిపి శంకర్ నాయక్,పీఏసీఎస్ ఛైర్మెన్ గుంటుక వెంకట్ రెడ్డి,జిల్లా యువజన నాయకులు వాసికర్ల వినయ్ రెడ్డి,మహిళా అధ్యక్షురాలు చామల సువర్ణ,మండల యూత్ అధ్యక్షులు రేపాకుల సాయి కుమార్,యువ నాయకులు కిలారీ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకం బిల్లులను వెంటనే చెల్లించాలి..



భూపాలపల్లి : అమృత్ తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వర్కర్స్ కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ కేసులు బిల్లులను వెంటనే చెల్లించాలని రాష్ట్ర మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ డిమాండ్ చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ (అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా అదన కలెక్టర్ అశోక్ కుమార్,డీఈఓ రాజేందర్ కు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొరిమి సుగుణ మాట్లాడుతూ.. జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా వంట బిల్లులు ఇవ్వలేదని వెంటనే వారికి పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. అట్లాగే కోడిగుడ్లు, అల్పాహార బిల్లులు కూడా పెండింగ్ లో ఉన్నాయని వాటిని కూడా చెల్లించాలన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు ప్రారంభమవుతున్న తరుణంలో మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని, వెంటనే ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న బిల్లులను చెల్లించి మధ్యాహ్నం భోజన కార్మికులను ఆదుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, వరలక్ష్మి, ఉమాదేవి, బెల్లంకొండ స్వప్న, సంబిడి చంద్రక్క, వేముల రాజేశ్వరి, సమత, సరోజన, కళావతి, మమత, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కేబుల్ ఆపరేటర్లపై పోల్ టాక్స్ భారం మోపడం సరైంది కాదు



భూపాలపల్లి : ఎన్నో ఏళ్లుగా ప్రజల వినోదానికి అనుగుణంగా కేబుల్ టీవీ ప్రసారాలను కొనసాగిస్తున్న కేబుల్ ఆపరేటర్ల పై ప్రభుత్వం పోల్ టాక్స్ భారం మోపడం సరైంది కాదని ఇండివిజువల్ కేబుల్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేషాల రమేష్ బాబు అన్నారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీ సింగరేణి మినీ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఇండివిజువల్ కేబుల్ ఆపరేటర్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మూలిగే నక్క పై తాటిపండు పడ్డట్టు ఇప్పటికే నష్టాలలో నడుపుతున్న కేబుల్ టీవీ లపై ప్రభుత్వం టీఎస్ ఎన్పీడీసీఎల్ ద్వారా పోల్ టాక్స్ పేరుతో అదనంగా వాడుతున్న కరెంటు పోల్ లను లెక్కించి పోల్ టాక్స్ కట్టాలంటూ కేబుల్ టీవీ ఆపరేటర్ల పై అదనపు ఆర్థిక భారాన్ని మోపడం హేయమైనా చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే పోల్ టాక్స్ విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు.కేబుల్ టీవీ ఆపరేటర్లను కుటీర పరిశ్రమలు గా గుర్తించి వివిధ శాఖల ద్వారా రుణ సదుపాయం కల్పించి కేబుల్ టీవీ లను ప్రోత్సహించాలని కోరారు. అనంతరం కేబుల్ ఆపరేటర్లు భూపాలపల్లి ఎమ్మెల్యే క్యార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు వినతి పత్రం అందించారు.సానుకూలంగా స్పందించి న ఎమ్మెల్యే విద్యుత్ శాఖ ఎస్ఈ తో ఫోన్లో మాట్లాడారు. అదే విధంగాకేబుల్ ఆపరేటర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా కేబుల్ ఆపరేటర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మూడున్నర దశాబ్దాల ఆత్మీయ సమ్మేళనం



దుబ్బాక: అమృత్ తెలంగాణ: ఒకే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు మూడున్నర దశాబ్దాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం పేరిట ఒకే వేదికను పంచుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆత్మీయ పలకరింపులతో భావోద్వేగానికి గురయ్యారు. ఆదివారం దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేట వార్డులోని జడ్పీహెచ్ఎస్ లో పదో తరగతి చదువుకున్న (1987- 88 బ్యాచ్) పూర్వ విద్యార్థులు.. అప్పటి గురువులు హెచ్ఎం నారాయణరెడ్డి, మ్యాథ్స్ టీచర్ మహిపాల్ రెడ్డి లను ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. పూర్వ విద్యార్థి గాజుల యాదగిరి ఇదే వార్డులోని ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఒక ఏడాది పాటు తాగునీటి సరఫరాకు అయ్యే ఖర్చును భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ధాత్రిక వెంకటరమణ, జక్క సత్యనారాయణ, ఆస రవి వంగ యాదగిరి, తడక సుధాకర్, బాలచంద్రం, సుధీర్, అవధూత భాస్కర్, కొండ అశోక్, సుభద్ర, రమాదేవి, సునీత పలువురు పాల్గొన్నారు.

# గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



భూపాలపల్లి :అమృత్ తెలంగాణ: జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు పొన్నం బిక్షపతి కోరారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ పి అశోక్ కుమార్ ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు ఆన్లైన్లో బుక్ చేసినప్పటికీ సిలిండర్ డెలివరీ సమయంలో రవాణ చార్జీల పేరుతో వినియోగదారుల నుండి అదనంగా రూ..100 వరకు అదనంగా వసూలు చేస్తూ, రిసిప్ట్ బిల్లు అడుగుతే ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. గ్యాస్ సిలిండర్ ల ను వినియోదారులకు అందుబాటులో ఉంచకుండా కమర్షియల్ సిలిండర్లకు బదులు ఇండ్లలో వాడే సిలిండర్లను హోటల్స్ బేకరీ షాపులలో నిల్వ ఉంచుతూ ప్రజలకు సకాలంలో అందించకుండా ఇబ్బందులు గురిచేస్తున్న గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళారులను గుర్తించి వారి లైసెన్సులు రద్దు చేయాలని, నుండి వారితో కుమ్మక్కైన అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ వేల్పుగొండ మహేందర్, జిల్లా ఉపాధ్యక్షులు మేకల ఓంకార్ ,భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జి మురారి సదానందం తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



భూపాలపల్లి : అమృత్ తెలంగాణ: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి తహసిల్దార్ వి. శ్రీనివాసులు తెలిపారు. సోమవారం భూపాలపల్లి మండలంలోని గొర్ల వీడుగ్రామంలో నిర్వహించిన రెవెన్యూసదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ రికార్డులో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు,వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సం బంధించిన దరఖాస్తులు సదస్సులో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ అంజలి రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు రామస్వామి, హజారుద్దీన్, సర్వేయర్ శ్రీనివాస రావు, అసిస్టెంట్ సర్వేయర్ శివ, జూనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, టైపిస్ట్ రాజు,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# కొనసాగుతున్న భూ భారతి సదస్సులు!



మల్హార్ రావు :అమృత్ తెలంగాణ: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా సోమవారం మండలంలో దబ్బగట్టు, గ్రామాల్లో మండల తహసిల్దార్ రవికుమార్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యదితిగా పిఏసిఎస్ చైర్మన్ ఇప్ప మొ0డయ్య హాజరై మాట్లాడారు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిస్కారం అవుతాయన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పంపిణీపై అసత్య ఆరోపణలు సరికాదు

తాడ్వాయి :అమృత్ తెలంగాణ: ఇందిరమ్మ ఇండ్ల పంపిణి పై అసత్య ఆరోపణలు చేయడం సరైనది కాదని, తప్పుడు ఆరోపణ చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ముదిరాజ్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన పేదలందరికీ ఇళ్ల కలను దశలవారీగా నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమం అని, అది నిరంతర ప్రక్రియ అని, వాటిపై తప్పుడు ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ములుగు జిల్లాకు 3500 ఇందిరమ్మ ఇల్లు తో పాటు అదనంగా 1500 ఇండ్లు పంపిణీ చేసిన ఘనత రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క దే అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా ఇసుక రవాణా చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీ దే అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ క్వారీలు నడుస్తున్నాయని, ఇసుక రవాణా చేస్తున్నామని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పూటకో పార్టీ మార్చుకుంటూ రాజకీయాలు చేస్తున్న మీరు ప్రజా ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదన్నారు. ప్రజా ప్రభుత్వం పై ఓరవలేక తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ



కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్ , మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అరెం లచ్చు పటేల్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు పాక సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ముజఫర్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, మాజీ ఎంపీపీ ఎనగంటి లక్ష్మయ్య, డైరెక్టర్లు సిద్ది రెడ్డి, జగన్, నాయకులు గౌని మధు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఈదురుగాలులకు లారీపై పడ్డ చెట్టు..



మద్నూర్ :అమృత్ తెలంగాణ: ఆదివారం అర్ధరాత్రి సమయంలో భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షానికి చెట్లు కూలిపడ్డాయి. మద్నూర్ మార్కెట్ యార్డులో ఆగిఉన్న లోడు లారీపై భారీ చెట్టు విరిగి పడింది. దీంతో ఉదయం మార్కెట్ కమిటీ అధికారులు లారీపై కూలిన చెట్టును తొలగించారు. అర్ధరాత్రి నుండి ఈదరుగాలులు, వర్ష భీభత్సానికి కరెంటు అంతరాయం ఏర్పడి ఉదయం వరకు రాలేదు. దీంతో పాటు మండలంలో అక్కడక్కడ భారీ చెట్లు నేలమట్టం అయ్యాయి.

# పేదల న్యాయ సమస్యల పరిష్కారానికి జైలుకైనా సిద్ధమే..

అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: ఏజెన్సీలో గిరిజనులకు భూమి దక్కాలంటే ప్రత్యక్ష పోరాటమే శిరోధార్యం అని,ఆక్రమణలో ఉండి సాగు చేస్తూనే దాన్ని పొందటానికి పోరాటం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు. గతంలో జిల్లా కలెక్టర్ ఆర్డర్స్ అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల ప్రకారం రామన్నగూడెం గ్రామ రెవిన్యూ సర్వే నెంబర్:30,36,39 లలో ఉన్న సాగు భూములను స్థానిక ఆదివాసీలకు అప్పగించాలని, రామన్నగూడెం గిరిజనులు నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట తహసీల్దార్, అటవీ శాఖ రేంజర్ కార్యాలయాల ముందు సోమవారం ప్రారంభించిన నిరవధిక నిరసన దీక్షకు సీపీఐ(ఎం) మండలం కమిటీ ఆద్వర్యంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య నేతృత్వంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ ..నేల విడిచి సాము చేసిన చందంగా కాకుండా మనకు దక్కాల్సిన సాగు భూమి ఎక్కడ ఉందో దానిలో ఉండి, సాగు చేస్తూ ప్రత్యక్ష పోరాటం చేయాల్సిన ఆవశ్యకతను గిరిజనులకు ఆయన వివరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ .. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా గిరిజనులు ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్య పరిష్కారానికి అయినా సీపీఐ(ఎం) నిత్యం గిరిజనులకు అండగా ఉంటుందని




ప్రకటించారు. గిరిజనుల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి జైలుకు వెళ్ళడానికి అయినా సిద్ధమే నని ఆయన అన్నారు. వీరి వెంట జిల్లా కమిటీ సభ్యులు బి.చిరంజీవి, మండల కార్యదర్శి సోడెం ప్రసాద్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మడిపల్లి వెంకటేశ్వరరావులు ఉన్నారు.

# ఎమ్మెల్యే తోటను కలిసిన మండల నాయకులు



మద్నూర్ : అమృత్ తెలంగాణ: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి సోమవారం సాయంత్రం హైదరాబాదులో మద్నూర్ సింగిల్విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ కలిశారు. ఎమ్మెల్యే ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే జుక్కల్ ఎమ్మెల్యే ఏఐజి ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ కావడంతో సోమవారం పలువురు నాయకులు హైదరాబాదుకు వెళ్ళి కలిశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాజా మాజీ సర్పంచ్ విట్టల్ గురూజీ తదితరులు పాల్గొన్నారు.

# జీపీ కార్యదర్శుల పెండింగ్ సమస్యలు తీర్చండి..

జుక్కల్ : అమృత్ తెలంగాణ: మండలంలోని 30 గ్రామ పచాయతీలలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు వెంటనే ప్రభుత్వం తీర్చాలని డిమాండ్ తొ కూడిన వినతి పత్రాన్ని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ కు సోమవారం అందించారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు మాట్లాడుతూ ..గ్రామ పంచయతీకి సంబంధించిన ఐ ఎఫ్ ఎం ఐ ఎస్ ట్రెజరీ యందు పెండింగ్లో ఉన్న చెక్కులను వెంటనే క్లియర్ చేయాలని, గ్రామపంచాయతీలో నిధులు విడుదల చేయాలని, పెండింగ్ చెక్కులు క్లియరెన్స్ కాకపోవడం వలన గ్రామపంచాయతీలో మాకు క్రెడిట్ ద్వారా సామాగ్రి, ట్రాక్టర్ నడిపేందుకు డీజిల్ ఇవ్వడం లేదని తెలిపారు. గ్రామపంచాయతీ రోజువారి నిర్వహణ కొరకు మా సొంత డబ్బులు అప్పు వడ్డీతో తెచ్చి ఖర్చు పెట్టే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. 11. 6 . 2025 నుండి గ్రామపంచాయతీలో ఆర్థిక లావాదేవీలు చేయలేమని తెలిపారు. గ్రామపంచాయతీలలో నెలకొంటున్న సాధారణ సమస్యలు వీధి దీపాలు తాగునీటి సమస్య వంటివి తీర్చలేక పోతున్నామని వివరించారు. నిజామాబాద్ , కరీంనగర్ జిల్లాలలో పంచాయతీ కార్యదర్శుల మీద చార్జ్ మెమోలు ఇచ్చిన వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. ఓపిఎస్ గా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు జేపిఎస్ గా ప్రమోట్ చేయాలని తెలిపారు. ఓపిఎస్ వ్యవస్థను రద్దు చేయాలని పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల విధి నిర్వహణ కాలాన్ని సర్వీస్ గా పరిగణించి ప్రొటెక్షన్ డిక్లేర్ చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ సాధారణ నిధులను ట్రెజరీ నుంచి తొలగించాలని, మున్సిపాలిటీ తరహాలో ప్రత్యేక



బ్యాంకు ఖాతాను ఏర్పాటు చేసి వాటి ద్వారా నిధులను గ్రామపంచాయతీకి సమకూర్చాలని అన్నారు. వారంలో మూడు పర్యాయాలు సమీక్షలు సమావేశాలు అని మండల కేంద్ర కార్యాలయానికి రావడం జరుగుతుంది. వాటికి ట్రావెలింగ్ అలివేషన్స్ ఇవ్వాలని, ఉపాధి హామీ కార్యనిర్వాహన కొరకు గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికారులు ఉన్నారని అన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులను ఉపాధి హామీ సామాజిక తనిఖీ నుండి పంచాయతీ కార్యదర్శులను తొలగించాలని డిమాండ్ తొ కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో శ్రీనివాస్కు అందించారు. ఈ వినతి పత్రం అందించే కార్యక్రమంలో మండలంలోని 30 గ్రామ పంచాయతీల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలి..

కమ్మర్ పల్లి :అమృత్ తెలంగాణ: మారుమూల గ్రామాల ప్రజలకు ఇంటర్ విద్యను అందించే లక్ష్యంతో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల బృందం సభ్యులు నాగాపూర్, హస కొత్తూర్ గ్రామాల్లో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇటీవల పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఇండ్లను సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించి, చదివించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ పొందిన అధ్యాపకులు నాణ్యతతో కూడిన విద్యను



తమ పిల్లలకు అందిస్తారని వివరించారు.ప్రభుత్వ కళాశాలలో చదివితే ఉండే లాభాలను, కమ్మర్ పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న వసతులను, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ పొందడం ద్వారా కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివించడం ద్వారా వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వెంకటేష్, గంగాధర్, రాజకుమార్, గంగారం, శ్రీహరి, వైష్ణవి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు పోలీస్ నిబంధనలు తూ.చ తప్పక పాటించాలి

కంఠేశ్వర్ :అమృత్ తెలంగాణ: ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్టించరాదు. ముఖ్యంగా జనరద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేపట్టరాదు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆద్వర్యంలోని కమిటీ యొక్క అనుమతులు తప్పనిసరిగా పొందవలసి ఉంటుంది అని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. ఎక్కువశబ్దంతో డి.జే లను ఏర్పాటుచేయరాదని, ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. రెసిడెన్షియల్ స్థలంలో, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలని, రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డి.జే ల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేదం గలదు. పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలి. ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డి. జేలు. సౌండ్ సిస్టంలు నిజామాబాద్ కమిషనరేటు పరిధిలో నిషేదం గలదు. ఎవరైనా సభలు, సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుండి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహించాలని భావిస్తే సంబంధిత అసిస్టెంటు పోలీస్ కమిషనర్ అనుమతి తప్పనిసరి. 500 మంది కంటే ఎక్కువ జనాలతో కూడిన కార్యక్రమనికి 72 గంటల ముందుగా పోలీస్ కమిషనర్ అనుమతి తీసుకోవాలి. మాల్స్, సినిమా థియేటర్స్, హెూటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం సెక్యూరిటి నిబంధనలు తప్పనిసరి పాటించాలి. ప్రతీ ఒక్కరు క్యూ పద్ధతిని తప్పనిసరి పాటించాలి. డ్రోన్ల వాడకం వలన ఎక్కువ ప్రమాదాలు పొంచి ఉన్న నేపద్యంలో నియంత్రణ చర్యలు తీసుకోవడం జరగుతుందని, ఈ డ్రోన్ల ఉపయోగం వలన జనజీవనానికి విఘాతం కలగడమే కాకుండా శాంతి భద్రతలకి విఘాతం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని




తెలిపారు. ఎవరయినా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రారంభించదలచినచో ముందస్తుగా సంబంధిత ప్రభుత్వ సంస్థలు, పోలీసు ఏవియేషన్ అధికారుల నుండి క్లియరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. జి ఎవరైనా అనుమానస్పదంగా కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. నిజామాబాద్ జిల్లాలో ఎ (పెద్దలు) సర్టిఫికేట్ పొందిన సినిమాలను మైనర్లు చూడటానికి థియేటర్లను అనుమతించరాదు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలను ఎవ్వరయిన అతిక్రమించినయెడల వారిపై సంబంధిత చట్టాల ప్రకారం తగు చర్యలు తీసుకోవడానికి నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లోని పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు / ఎస్.ఐ లకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అధికార ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తేది:01-06-2025 నుండి తేది 15-06-2025 వరకు అమలులో ఉంటుంది. అని కావున ప్రజలందరూ సంబంధిత పోలీస్ అధికారులకు సహకరించాలన్నారు.

# రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు పెట్టుకోండి..

జుక్కల్ : అమృత్ తెలంగాణ: సత్వర భూ సమస్యల కొరకు రెవెన్యూ సదస్సులు దరఖాస్తులు పెట్టుకోవాలని జుక్కల్ డిప్యూటీ తాసిల్దార్ హేమలత , ఆర్ఐ రామ్ పటేల్ తెలిపారు. మండలంలోని డోన్గావ్, మాదాపూర్ గ్రామాలలో రెండు బృందాలుగా ఏర్పడి సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డోన్గావ్, మాదాపూర్ గ్రామాలలో గ్రామ ప్రజలు భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొని తమ సమస్యలను రాతపూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. మండలంలో అత్యధికంగా భూవివాదాలు గెట్ పంచాయతీలు అధికంగా ఉండడంతో




అధికారులు సమస్యలను పరిష్కరించేందుకు సామరస్యంగా ఉండాలని, ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా అధికారులను సంప్రదించి సమస్యలను ఉమ్మడిగా కూర్చొని పరిష్కరించుకోవడం ఉత్తమమని సమస్యలున్నవారికి సూచించారు. ఈ కార్యక్రమంలో రివెన్యు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య..

మద్నూర్: అమృత్ తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరే విధంగా ప్రతిష్టాత్మకంగా బడిబాట కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన చేపడుతుంది. ఈ బడిబాట కార్యక్రమంలో భాగంగా మద్నూర్ మండలంలోని చిన్న తడగూర్ గ్రామపంచాయతీ పరిధిలో చిన్నతడుగూర్, ఖరగ్, ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు అడ్మిషన్ల కోసం ఇంటింటా ప్రచారాన్ని పాఠశాల ఉపాధ్యాయులు సాయికుమార్ అంగన్వాడీ టీచర్ యశోద చేపడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉ ంటాయని, నాణ్యమైన విద్య బోధన ఉంటుందని అన్నారు. పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని బడిబాట కార్యక్రమంలో ముమ్మర ప్రచారాన్ని నిర్వహించారు. ప్రభుత్వపరంగా పిల్లలకు అందించే సౌకర్యాల గురించి వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్ చిన్నారి పిల్లలు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ



మద్నూర్ :అమృత్ తెలంగాణ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మద్నూర్ మండలంలోని దన్నూర్ లో 10వ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాదవ్ మనోహర్, లబ్దిదారురాలు దేవ్కత్తె చైతన్య బాయి,జిపి సిబ్బంది ఎల్ లక్ష్మణ్, విఠల్,చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ హక్కుల కోసం నిరంతరం పోరాటం

కంఠేశ్వర్ :అమృత్ తెలంగాణ: ఉపాధ్యాయ హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ధర్మేందర్ తెలిపారు. ఈ మేరకు సోమవారంసంఘా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్ టి యు భవన్ లో సంఘం పతకాన్ని జిల్లా అద్యక్షులు ధర్మెందర్ ఆవిష్కరించి ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజాం ప్రభుత్వంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాడానికి మగ్దూం మొయినుద్దీన్ 1947 లోఏర్పాటు చేసిన సంఘం స్టేట్ టీచర్స్ యూనియన్.అప్పటినుండి నిరంతరం ఉపాధ్యాయుల హక్కులకోసం పోరాడుతూ మొదటగా పిఆర్సి , డి ఎ, పెన్షన్ లను సాధించి పెట్టిన సంఘం ఎస్ టి యు, ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని ప్రతి తరగతి కి ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా ,భౌతికశాస్త్రం,ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ ప్రతి ఉన్నత పాఠశాల లో ఉండాలి అని మొదటగా చెప్పి దానిని సాధించడం జరిగింది.ఈ విధంగా ఉపాధ్యాయుల హక్కులు,సంక్షేమం ,పాఠశాలల బలోపేతం కోసం కృషి చేస్తూ,విద్యార్థులు ఉన్నతిని ఆకాంక్షిచే సంఘం స్టేట్ టీచర్స్ యూనియన్ అని, ఎస్ టి యు ముందు తరం నాయకులైన కాళోజీగారు,ప్రో.జయశంకర్ సార్, పూర్వ ఎమ్మెల్సీ లైన వాణి



విజయరామారావు, రామమూర్తి,రాష్ట్ర,జిల్లా పూర్వ అధ్యక్ష కార్యదర్శులు బాటలో నడిచి సంఘ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత లేని సీసీరోడ్ల నిర్మాణం..

మద్నూర్ :అమృత్ తెలంగాణ: మండలాభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే తోట ప్రభుత్వం నుండి భారీగా నిధులు మంజూరు చేయించిన విషయం విదితమే. కానీ ఆ నిధులు దుర్వినియోగం అవుతుండడం ప్రజలను కలవరపెడుతోంది. ఈమధ్య సీసీ రోడ్ల నిర్మాణం నాసిరకంగా వేశారు. దీనివల్ల నిన్నమొన్న పడ్డ మామూలు వర్షాలకే సిమెంటు రోడ్లలో కంకర తేలిడం, మధ్యమద్యలో గుంతలు పడడం చూసి, ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా రూ.55 లక్షలు ప్రజాధనం రోడ్డుపాలు చేశారని స్థానికులు మండిపడుతున్నారు. ఈ నాసిరకం పనులకు కారణం కాంట్రాక్టర్లా.. లేక




ప్రజా ప్రతినిధులా అని ఆరా తీస్తున్నారు. ఇప్పుడిప్పుడు వేసిన రోడ్లే ఇలా ఉంటే.. భవిష్యత్తులో వచ్చే వర్షాకాలం నాటికి ఈ రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో .. అసలు రోడ్డు కనిపిస్తుందా.. అని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజల ఆవేదన మేరకు ఎమ్మెల్యే రోడ్డు పరిస్థితిని మళ్ళీ సంబంధిత అధికారులతో పరిశీలించి, నిర్లక్ష్యం ఎవరిదో వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# శ్రీ చైతన్య, నారాయణ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కంఠేశ్వర్ :అమృత్ తెలంగాణ: బిల్డింగ్ పర్మిషన్ లేని కార్పొరేట్ శ్రీ చైతన్య, నారాయణ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. బిల్డింగ్ పర్మిషన్ లేని ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థల అయినటువంటి శ్రీ చైతన్య నారాయణ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సీబీఎస్ఈ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న వేళ ప్రయివేటు పాఠశాలలో అడ్మిషన్ల పేరుతో ఫీజుల పేరుతో అక్షరాలను అడ్డుగా పెట్టి లక్షల రూపాయలను వసూలు చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ గారు డిస్ట్రిక్ట్ ఫీజు రెగ్యులేషన్ కమిటీకి చైర్మన్ గా జిల్లా విద్యాశాఖ అధికారి సభ్యులుగా ఉన్నారని వెంటనే ఫీజుల పైన సమావేశం ఏర్పాటుచేసి అధిక ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా నిర్ణయం చేయాలని అన్నారు. అదేవిధంగా విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో సంక్షేమ



హాస్టల్లో అనేక సమస్యలకు నిలయంగా మారాయని వెంటనే వెంటనే సంక్షేమ హాస్టల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని దీనికి జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, జిల్లా నాయకులు రాజు, విశాల్ , తదితర నాయకులు పాల్గొన్నారు.

# కాటాపూర్ లో ముమ్మరంగా సాగిన బడిబాట..



తాడ్వాయి :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ చదువు.. ప్రతిభకు మెరుగు .. ప్రయివేటు వద్దు.. ప్రభుత్వ చదువే ముద్దు అంటూ మనం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు సోలం శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సోమవారం బడిబాట కార్యక్రమం ముమ్మరంగా కొనసాగింది. బడిబాట కార్యక్రమంలో కాటాపూర్ (జెడ్పిహెచ్ఎస్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బాణాల సుధాకర్, ఉపాధ్యాయ బృందం, ప్రభుత్వ చదువుల కోసం ఇంటింటా తిరుగుతూ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ల కోసం అవగాహన కల్పించారు. ప్రభుత్వ చదువులతో రాబోయే కాలంలో పిల్లలకు భవిష్యత్తు ఉంటుందని, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అనుభవజ్ఞులైన క్వాలిఫై టీచర్లచే విద్య బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్, ప్రతి ఒక్క విద్యార్థికి ఉచిత నోట్ బుక్స్ అందించడం జరుగుతుందని తెలిపారు. డిజిటల్ పరికరాల ద్వారా నాణ్యమైన విద్య బోధన, ప్రత్యేక తరగతులతో పాటు వ్యక్తిగత శ్రద్ధ, ఉచిత మధ్యాహ్న భోజనం, విద్యార్థులలో పౌష్టికాహార లోపాన్ని నిర్మూలన కోసం వారానికి మూడు రోజులు గుడ్లు, మూడు రోజులు రాగి జావా అందించబడతాయని అన్నారు. ఈ విధమైన సౌకర్యాలతో ప్రభుత్వం అన్ని రకాల విద్యా బోధన అందిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అడ్మిషన్లు చేయించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ప్రచారంలో జడ్పీహెచ్ఎస్ కాటాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానాల సుధాకర్, తో పాటు ఉపాధ్యాయ బృందం, మనం వెల్ఫేర్ సొసైటీ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: ఎంఈఓ

మల్హర్ రావు:అమృత్ తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను అందిస్తారని మండలం ఎంఈఓ లక్ష్మన్ బాబు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని తాడిచెర్ల, మల్లారం, ఎడ్లపల్లి మోడల్ స్కూల్, దుబ్బపేటలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో బడిబాట కార్యక్రమాలు, పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు తమ భాగస్వామ్యంతో ఉత్తమ విద్యా ప్రమాణలు కలిగిన, ఉత్తమ విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపించాలని కోరారు. బడిడు పిల్లలను బడుల్లో చేర్పించేలా ఉపాధ్యాయులతో సంయుక్తంగా చొరవ తీసుకోవాలని చూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఏఎమ్మార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# సీతకి వయసు తో వచ్చిన కష్టాలు పాపం..!



సీతారామం సినిమా తో తెలుగు లో ఒక్కసారిగా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. హిందీలో ఈమె సినిమాల్లో ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయ్యింది.. అంతకు ముందే సీరియల్స్ లో కూడా ఈ అమ్మడు చాలానే పాపులారిటీని సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం దక్కిన స్టార్ డమ్.. సూపర్ హిట్ మాత్రం ఆమెకు ఇన్నాళ్ల సినీ కెరీర్ లో దక్కలేదనే చెప్పాలి. దుల్కర్ సల్మాన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన సీతారామం సినిమాలో సీత పాత్రకు అచ్చు గుద్దినట్లుగా అద్భుతంగా సెట్ అవ్వడంతో ప్రతి ఒక్కరు కూడా ఫిదా అయ్యారు.. ఇంకా కూడా అవుతూనే ఉన్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో వరుసగా సినీ ఆఫర్లు దక్కించుకుంటున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాలు ఆసక్తికరంగా మారాయి. ఒక పాత్ర కోసం వేశ్య గృహంలో ఉండాల్సి వచ్చిందని చెప్పిన మృణాల్ ఠాకూర్ కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న సవాళ్లు గురించి పలు ఆసక్తికర విషయాలను చెప్పింది. ఇదే సమయంలో ఆమె తన వయసు గురించి కాస్త అసహనంతో మాట్లాడింది. నా వయసు ప్రస్తావన వచ్చిన ప్రతి సారి కూడా చాలా మంది పెళ్లి గురించి అడుగుతూ ఉంటారని.. ప్రేమ లో పడలేదా అంటూ ఆశ్చర్యంగా ఫేస్ పెడతారు అంటూ మృణాల్ పేర్కొంది. నా వయసు 30 ఏళ్లు అంటూ చెప్పగానే మీరు పెళ్లి చేసుకోవాల్సిన సమయం వచ్చినట్లుంది.. పెళ్లి పై మీ యొక్క అభిప్రాయం అంటూ చాలా మంది ప్రశ్నలతో ముంచెత్తుతున్నారు. ఎన్నో సార్లు సమాధానం చెప్పినా కూడా ప్రేమ గురించి నన్ను ఎప్పుడూ ఎవరో ఒకరు ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రేమ గురించి నాకంటూ ఒక అవగాహణ ఉందని మృణాల్ పేర్కొంది.

# వెబ్ సిరీస్ లో ఊర్మిళ దుమారం తప్పదా?

బాలీవుడ్ బ్యూటీ ఊర్మిళ మండోత్కర్ నాలుగేళ్లగా సినిమాలకు దూరంగా ఉంటోన్న సంగతి తెలిసిందే. అవకాశాలు రాక...సరైసనన పాత్రలు దొరకక గ్యాప్ ఇచ్చిందా? అన్నది క్లారిటీ లేదు గానీ..ఊర్మిళ తెరపై ఎప్పుడు కనిపించినా ఓ సంచలనమే అన్నది వాస్తవం. యాభైకి చేరువలోనూ ఊర్మిళ ధగధగల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వెండి తెరపై మెరిసిన అమ్మడు బుల్లి తెరపైనా తనదైన మార్క్ వేసింది. పలు రియాల్టీ షోలను హోస్ట్ చేసి ఐడెంటీ వేసింది. ప్రస్తుతం డిడ్ సూపర్ మామ్స్ సీజన్ -3రని హోస్ట్ చేస్తోంది. తాజాగా ఊర్మిళ వెబ్ సిరీస్ లకు సై అనేసింది. 'తివారీ' అనే వెబ్ సిరీస్ కి కమిట్ అయినట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె ద్విపాత్రాభినయం చేస్తుంది. తల్లి -కుమార్తె నేపథ్యంలో సాగే స్టోరీ కావడంతో ఆ రెండు పాత్రలు కూడా ఆమె పోషిస్తుందిట. పాత్రలకు సంబంధించి ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటుందిట. గత ఆరు నెలలుగా అదే పనిలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పాత్రల గురించి స్పందించింది. ' నాలోని నటికి తివారీ సవాల్ విసురుతుంది. ఇందులో అనుబంధాలే కాదు.. ఊహించని మలుపు యాక్షన్ సన్నివేశాలు..రొమాంటిక్ సీన్లు ఉంటాయని' రివీల్ చేసింది. మొత్తానికి ఊర్మిళ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ గట్టిగానే ఊపేటట్లు కనిపిస్తుంది. స్టార్ హీరోయిన్ గా కొనసాగినంత కాలం బాలీవుడ్ ని ఓ ఊపు ఊపేసింది. ఆ తర్వాత ఒక్కసారిగా చల్లబడింది. కొంత కాలంగా సరైన అవకాశాలు రావడం



లేదు. ఈ క్రమంలో కొంత గ్యాప్ వచ్చింది. మళ్లీ ఇప్పుడు ఓటీటీని షేక్ చేయడానికి రెడీ అవుతోంది. ప్రస్తుతం వెబ్ సిరీస్ ల్లోకి స్టార్ హీరోయిన్లు సైతం ఎంట్రీ ఇస్తున్నారు. ఈక్రమంలో అక్కడా పోటీ వాతావరణం కనిపిస్తుంది. ఒకరికొకరు పోటీ పడుతూ సత్తా చాటుతున్నారు. వెండి తెరను మించి ఓటీటీ బోల్డ్ కంటెంట్ లో విచ్చలవిడిగా నటించడానికి ఎలాంటి అడ్డంకులు పెట్టడం లేదు. ఛాన్స్ ఇవ్వాలే గానీ.. దర్శకుడి సృతజాన్మతకని మించి పెర్పార్మెన్స్ ఇస్తున్నారు. మరి ఆ రకంగా ఊర్మిళ కూడా రేసులో నిలుస్తుందా? అన్నది చూడాలి. ఊర్మిళ తెలుగులోనూ అంతే ఫేమస్. ఆమె 'అంతం'..'గాయం'..'అనగనగా ఒక రోజు' లాంటి తెలుగు చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే.

# మంచి ఆఫర్లు రాబడుతున్న 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్'

'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' సినిమా అక్టోబర్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సోషల్ మీడియా సర్కిల్స్ లో మంచి సంచలనం సృష్టించింది. చిత్రాన్ని ఎక్కువ మంది ప్రేక్షకులను చేరుకోవడానికి మేకర్స్ తమ ప్రయత్నాలను రెట్టింపు చేస్తున్నారు. ఇంతకుముందు విడుదల చేసిన క్రేజీ ట్రైలర్ మరియు ప్రమోషనల్ సాంగ్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ఇది బయ్యర్ల నుండి మంచి ఆఫర్లు రావడానికి దోహదపడినట్లు సమాచారం. 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' చుట్టూ నెలకొన్న హైప్ దృష్ట్యా ఈ సినిమా ఆంధ్ర నైజాం మరియు సీడెడ్ ఏరియాలకు బయ్యర్లు సుమారు 3 కోట్ల కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. యునిక్ కాన్సెప్ట్.. ప్రత్యేకమైన కథనం ప్రేక్షకులకు విభిన్నమైన



అనుభూతిని ఇస్తుందని సినీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా సినిమా ప్రీ క్లైమాక్స్ పార్ట్ ఎప్పుడూ చూడని ఎమోషన్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని అంటున్నారు. అలాగే సంగీతం సినిమాటోగ్రఫీ మరియు క్రిస్ప్ ఎడిటింగ్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని పేర్కొంటున్నారు. దీన్ని బట్టి చూస్తే 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' సినిమా మంచి బిజినెస్ డీల్ తో ముగించే అవకాశం ఉందని అనుకోవచ్చు. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ లో విశ్వంత్ - మాళవిక సతీషన్ హీరోహీరోయిన్లుగా నటించారు. ఫ్రైమ్ షో ఎంటెర్టైన్మెంట్స్ మరియు స్వస్తిక సినిమా బ్యానర్స్ పై నిరంజన్ రెడ్డి - వేణు మాధవ్ పెద్ది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.






ఈశాన్యామహేశ్వరి హాట్ ఇన్ రెడ్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com